నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 2 జనవరి 2025 | KAMAREDDY

హ్యాపీ న్యూఇయర్ సార్!

నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ గ్లోబల్ కో-ఆర్డినేటర్ బిగాల మహేశ్‌గుప్తా తదితరులు ఉన్నారు.

రోడ్లపైకి వచ్చినా స్పందించరా!

- ప్రభుత్వ తీరుపై ఎస్ఎస్ఏ ఉద్యోగుల అసహనం
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె

కామారెడ్డి/ కంఠేశ్వర్, జనవరి 1 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. సమ్మెలో భాగంగా కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ ఇందిరాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. విద్యా బోధన ఆపేసి, మహిళలు రోడ్డు ఎక్కి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కోరారు. నిజామాబాద్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, యూటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు.

కామారెడ్డిలో ఇందిరాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ఆలయాలకు జీపీఎస్

- మాన్యం భూముల వివరాలు సైతం..
- గూగుల్ మ్యాప్స్‌తో అనుసంధానం
- ఉమ్మడి జిల్లాలోకొనసాగుతున్న ప్రక్రియ

ఇంటర్నెట్‌లో పూర్తి సమాచారం

సుభాష్‌నగర్, జనవరి 1: ప్రాచీన, ప్రసిద్ధ ఆలయాలకు ఆధునిక సాంకేతికతను జోడించేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ చర్యలు చేపట్టింది. ఉమ్మడి జిల్లాల ఆలయాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేయడానికి సన్నాహాలు ప్రారంభించింది. కామారెడ్డి, నిజామాబాద్‌లలో ఉన్న ఆలయాలన్నింటినీ సులభంగా గుర్తించేలా, వాటి అధీనంలోని భూములు, ఆస్తుల వివరాలు తెలియజేసేలా మొబైల్‌యాప్‌ను రూపొందిస్తున్నది. ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా ఆ శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తుండటం విశేషం. ఇందుకు అన్ని ఆలయాల సమాచారాన్ని గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్)తో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేసింది.

అన్ని అంశాలపై..

ఆలయాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం కోసం మూడు నెలల నుంచి ఉమ్మడి జిల్లాలో జీపీఎస్ నమోదు ప్రక్రియను చేపట్టారు. ఆలయం ఎక్కడ ఉంది. దాని సరిహద్దులేమిటి, దీని పరిధిలోకి వచ్చే భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి, అవి ఏ సర్వే నంబర్లలో ఉన్నాయి.. ఇలా ప్రతి అంశం అందరికీ తెలిసేలా ఆధునిక సాంకేతికతతో సమాచారం పొందుపరిచారు. దేవాదాయశాఖ పరిధిలో పబ్లికేషన్, రిజిస్టర్‌లో నమోదుతో పాటు ధూపదీప నైవేద్యం కింద ఎంపికైన ఆలయాలకు జియో ట్యాగింగ్ చేస్తున్నారు.

వెయ్యి గుళ్లకు సంబంధించి..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,357 ఆలయాలు ఉన్నాయి. ధూపదీప నైవేద్య పథకం కింద 600 ఆలయాలను జీపీఎస్ కింద నమోదు చేశారు. ఈవోలు, సిబ్బందితో జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్‌లో చిత్రాలు తీయించి అక్షాంశాలు, రేఖాంశాలు, ప్రాంతం ఆధారంగా సమాచారాన్ని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపుతున్నారు. అక్కడ జియో ట్యాగింగ్‌తో నిర్ధారిస్తారు. దీంతో గూగుల్ మ్యాప్‌లో సమాచారమంతా నిక్షిప్తమవుతుంది. తద్వారా మనం శోధించే ఆలయానికి సంబంధించిన సమాచారం తెరపై ప్రత్యక్షమవుతుంది.

భూములు సైతం..

ఉమ్మడి జిల్లాలో 384 ఆలయాలకు 4,153. 25 ఎకరాల మాన్యం ఉంది. నిజామాబాద్ జిల్లాలోని 247 ఆలయాల పరిధిలో 2,287.18 ఎకరాలు, కామారెడ్డి జిల్లాలోని 137 ఆలయాల పరిధిలో 1,866.06 ఎకరాలు ఉన్నట్లు భూ రికార్డులు చెబుతున్నాయి. ఆయా ఆలయాలకు చెందిన భూములు, ఆస్తుల వివరాలను సైతం చిత్రాల ద్వారా సేకరిస్తున్నారు. ధరణి వెబ్‌సైట్‌లో జియోగ్రఫీ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ద్వారా వాటిని పరిశీలించి భూముల సరిహద్దులను మార్కింగ్ చేస్తున్నారు. ఆ తర్వాత జియో ట్యాగింగ్‌లో జీపీఎస్ ద్వారా ఫిక్స్ చేస్తారు. తద్వారా భూములు కబ్జాకు గురి కాకుండా ఉండే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

పక్కాగా సమాచారం...

దేవాదాయశాఖ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆలయాల వివరాలను జియో ట్యాగింగ్ చేస్తున్నాం. పూర్తి సమాచారం సేకరిస్తున్నాం. ఆలయాల భూములు, ఆస్తులను పక్కాగా సంరక్షించడానికి ఇదెంతో ఉపయోగపడనున్నది. కబ్జాదారులపై సెక్షన్ 83 ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- శ్రీరాం రవీందర్‌గుప్తా, ఇన్‌చార్జి సహాయ కమిషనర్

అందరికా.. కొందరికా?

- కోతలు పెట్టేందుకే కాంగ్రెస్ సర్కారు ప్రయత్నాలు
- కుటుంబం యూనిట్‌గా తీసుకునే యోచనలో ప్రభుత్వం
- పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేసే అవకాశం
- అలాగైతే భారీగా నష్టపోనున్న రైతులు
- సగానికి సగం తగ్గనున్న లబ్ధిదారులు
- ప్రభుత్వ విధివిధానాలపై రైతుల్లో చర్చోపచర్చలు

సంక్రాంతి నుంచి రైతుభరోసా

అమలు చేస్తామన్న రేవంత్ సర్కారు ప్రకటనపై రైతుల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకంలో తీసుకురానున్న మార్పులపై సర్వత్రా ఆందోళన నెలకొన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లు అందరికీ పెట్టుబడి సాయం ఇస్తారా? లేక కొర్రీలు పెట్టి కొందరికే ఇస్తారా? అన్నది చర్చనీయాంశమైంది. రైతుబంధు పథకంలో మార్పులకు సిద్ధమైన కాంగ్రెస్ ప్రభుత్వం.. కుటుంబం యూనిట్‌గా అమలు చేయాలని చూస్తున్నది. అలాగే, ఎన్ని ఎకరాలు ఉన్నా ఐదు లేదా ఏడు ఎకరాలకు మాత్రమే ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. పైగా రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది.



హస్తం పార్టీపై అన్నదాతల గుర్రు..

రూ.2 లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ సర్కారు నాలుగు విడుతల్లో కలిపి కొంత మంది రైతులను మాత్రమే రుణ విముక్తులను చేసింది. సగం మందికి మొండిచేయి చూపింది. సాంకేతిక కారణాలను చూపి చాలా మందికి రుణమాఫీ ఎగ్గొట్టారు. కుటుంబంలో ఒకరికే రుణమాఫీ అంటూ సగానికి ఎక్కువ మందిని పక్కకు జరిపింది. తాజాగా రైతుభరోసా పథకం అమలులోనూ ఇదే అస్తవ్యస్త విధానం కనిపిస్తుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై గుర్రుమంటున్నారు. రెండు పంట సీజన్లలో కలిపి ఏడాదికి రూ.15 వేల చొప్పున సాయం అందాల్సి ఉండగా, ఇప్పటికీ చిల్లి గవ్వా అందలేదు. దీంతో రైతాంగం అప్పులు తెచ్చి నాట్లు వేస్తున్నది.

నిజామాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతు డిక్లరేషన్ పేరిట అనేక వరాలు కురిపించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. అమలులో మాత్రం విఫలమైంది. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అని చెప్పి కొంత మందికే మాఫీ చేసి చేతులు దులుపుకున్నది. రైతుబంధు పథకం అమలు చేయకుండా రైతులను దారుణంగా మోసగించింది. రైతుబంధు కింద ఇస్తున్న రూ.5 వేలను రూ.7,500కు పెంచి రైతుభరోసా పథకం తీసుకొస్తామన్న హామీ ఏడాది దాటినా అమలు కాలేదు. రెండు సీజన్లకు సంబంధించి పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన ప్రభుత్వం.. సంక్రాంతి నుంచి ఇస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో రైతుభరోసా విధివిధానాల ఖరారుపై సర్కారు దృష్టి సారించడంతో రైతుల్లో ఉత్కంఠ నెలకొంది. రైతుబంధు తరహాలో అందరికీ పెట్టుబడి సాయం ఇస్తారా? లేక కొందరికే ఇస్తారా? అన్నది చర్చనీయాంశమైంది.

డిసెంబర్ 7, 2023న కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 2023 యాసంగిలో నామమాత్రంగా రైతుబంధు సాయాన్ని విడుదల చేసింది. మొన్నటి రబీ సీజన్‌లోనూ పెట్టుబడి సాయం ఇవ్వలేదు. ప్రస్తుతం యాసంగి మొదలై రెండు నెలలు గడిచినా రైతుభరోసాపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చలో బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టింది. రైతుబంధు డబ్బులు ఇవ్వకపోవడాన్ని ఎత్తిచూపింది. రైతుభరోసాపై అన్నదాతల్లో అలుముకున్న అనుమానాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెడిసెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సాంకేతిక అంశాలతో పాటుగా శాస్త్రీయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. రైతుభరోసాను అందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కానీ, మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చే ప్రతిపాదనల ఆధారంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తున్నది.

గందరగోళంలో రైతులు..

కేసీఆర్ హయాంలో ఉమ్మడి జిల్లాలోని 5 లక్షల మందికి పైగా రైతులకు పెట్టుబడి సాయం ఠంచన్‌గా అందేది. రెండు సీజన్లలో కలిపి రూ.వెయ్యి కోట్ల దాకా రైతులకు లబ్ధి చేకూరేది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం ఆగిపోయింది. వానకాలంలో ఇవ్వకుండా ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు.. యాసంగికి సంబంధించి సంక్రాంతికి ఇస్తామని చెబుతున్నది. విధివిధానాల ఖరారులో నిమగ్నమైంది. పంట సాగు చేసిన భూములకు అది కూడా రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతున్నది. మరోవైపు, ఏ పంటలు సాగు చేస్తే రైతుభరోసా వర్తిస్తుంది? ఉద్యాన పంటల సాగుకు ఇస్తారా? పామాయిల్ లాంటి దీర్ఘకాలిక పంటలు సాగు చేస్తున్న రైతులకు రైతుభరోసా వస్తుందా రాదా? అన్నది స్పష్టత కరువైంది. అంకాపూర్ వంటి ప్రాంతాల్లో మూడు పంటలు సాగు చేసే రైతులున్నారు. పంటల ఆధారంగా పెట్టుబడి సాయం ఇస్తే వీరికి మూడు విడుతల్లో రైతుభరోసా వస్తుందా? అని రైతులు అడుగుతున్నారు. పసుపు పంట సాగు చేసే వారికి ఏడాది కాలం గడిచి పోతున్నది. 9 నెలల పసుపు పంటను సాగు చేసే వారికి ఏ ప్రాతిపాదికన రైతుభరోసా అందిస్తారో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు.

కామారెడ్డిలో చేపట్టిన సమ్మెలో పాల్గొన్న హమాలీలు

సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మెబాట

- పెంచిన కూలి అమలు చేయాలని డిమాండ్
- ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో నిరవధిక దీక్షలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 1 : సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌లో సమ్మె సైరన్ మోగింది. మూడు నెలల క్రితం కూలి పెంచుతామని ఒప్పందం జరిగినా.. ఇంత వరకూ అమలుచేయకపోవడంతో కార్మిక లోకం ఆందోళన బాట పట్టింది. పెంచిన కూలి అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, డిచ్‌పల్లి, బిచ్కుందలో బుధవారం హమాలీలు, ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024 అక్టోబర్ 10వ తేదీన జరిగిన చర్చలో హమాలీ రేటు క్వింటాలుకు ఎగుమతి, దిగుమతికి రూ. 26 నుంచి 29 రూపాయలకు పెంచారని తెలిపారు. పెంచిన కూలిని ఏరియర్స్‌తో చెల్లించాలని డిమాండ్ చేశారు. దసరా పండుగ సందర్భంగా ఇస్తున్న స్వీట్లు, బోనస్, యూనిఫాం కుట్టుకూలి ఇప్పటివరకూ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వానికి ప్రపోజల్‌ను పంపి, వెంటనే చెల్లించాలని కోరారు. పెంచిన కూలికి సంబంధించిన జీవోను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిగా కాలయాపన చేస్తున్నదని అన్నారు. వెంటనే చర్చలకు ఆహ్వానించి, హమాలీల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కామారెడ్డి జిల్లాలో ఏడు గోదాములు కిరాయిలో కొనసాగుతున్నాయని, కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

నేడు జిల్లాకు ఏకసభ్య కమిషన్ రాక

- నూతన కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం
- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు వెల్లడి

కంఠేశ్వర్, జనవరి 1 : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ గురువారం నిజామాబాద్‌కు జిల్లాకు రానున్నదని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకసభ్య కమిషన్ ఉప వర్గీకరణ, వివరణాత్మక అధ్యయనం కోసం వస్తున్నదని పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన వారు హాజరై తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్‌తో కూడిన ఏకసభ్య కమిషన్‌కు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ఎస్సీ కులానికి చెందిన ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ఇతర ఉద్యోగులు తమ వినతులను ఏకసభ్య కమిషన్‌కు అందజేయాలని పేర్కొన్నారు.

కామారెడ్డి అడిషనల్ ఎస్పీగా చైతన్యారెడ్డి బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి, జనవరి 1 : కామారెడ్డి అడిషనల్ ఎస్పీగా చైతన్యారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్సైలతో సమావేశమయ్యారు. కేసు ల వివరాలు, పోలీసు అధికారుల పని తీరు,కొత్త సంవత్సరంలో చేయాల్సిన పనులపై చర్చించారు. తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.